సాక్షి సూర్యాపేట

శనివారం, 16 ఆగస్టు, 2025

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను నేడు (శనివారం) మాకు పంపించండి. ఆదివారం సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయస్సు 10 సంవత్సరాలలోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పని సరిగా పేర్కొనాలి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : **99489 38922**

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :		**590** అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	**586.90** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**1,46,296** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,44,774** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,476** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**4,050** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివి
- ఇక నుంచి రేషన్ డీలర్లకు నేరుగా కమీషన్ డబ్బులు
- 79వ స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన 79వ స్వాతంత్య్ర వేడుకలకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిన ఘనత భారత దేశానికే దక్కిందన్నారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 3.48 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. తద్వారా రూ.191.78 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. రూ.500లకే గ్యాస్ పథకం కింద జిల్లాలో 4,05,898 మంది వినియోగదారులకు 5,52,043 సిలిండర్లు పంపిణీ చేసి సబ్సిడీ కింద రూ.15.26 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్లకు ఇక నుంచి ప్రభుత్వమే నేరుగా వారి ఖాతాల్లో కమీషన్ సొమ్మును ప్రతినెలా జమ చేస్తుందని స్పష్టం చేశారు.



కలెక్టరేట్ ఆవరణలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో బాలికల నృత్య ప్రదర్శన





తొలి విడతగా 12,868 ఇళ్లు మంజూరు

తొలి విడతగా జిల్లాలో 12,868 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా 1,050 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. వీటికి రూ.22 కోట్లను లబ్ధిదారులకు చెల్లించామన్నారు. విద్యాపరంగా కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఒక్కోటి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం, హుజూర్‌నగర్‌కు వ్యవసాయ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు.

పేదలకు ఆహార భద్రత కల్పించాం

పేదలకు ఆహార భద్రత కల్పించామని, ఇందు కోసం గత ఉగాది నుంచి సన్నబియ్యం అందజేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో 3,26,057 రేషన్ కార్డుదారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. పేదల ఆత్మగౌరవానికి మరో ప్రతీకగా నిలిచే రేషన్ కార్డులను పదేళ్ల తర్వాత అర్హులందరికీ ఇచ్చామన్నారు. కొత్తగా జిల్లాలో 36,812 కార్డులు మంజూరు చేయడమే కాకుండా 70,932 మంది సభ్యుల పేర్లను చేర్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం ప్రకటించి పరిమితులు లేకుండా ప్రతి రైతుకు సాయం చేశామని చెప్పారు. ఈ పథకంలో 2,87,234 మంది రైతుల ఖాతాల్లో రూ.366.50 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందన్నారు. రైతు బీమా పథకం కింద జిల్లాలో 2024–25లో మృతిచెందిన 817 మంది రైతుల నామినీలకు రూ.35 కోట్లను చెల్లించామని తెలిపారు. సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు క్వింటాకు రూ.500ల చొప్పున బోనస్ చెల్లించి సన్నవడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు.

ఎత్తిపోతలకు అధిక నిధులు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా జిల్లాలో తక్కువ ఖర్చుతో లిఫ్టులు నిర్మించి ఎక్కువ ఆయకట్టు సాగులోకి తెచ్చామన్నారు. జిల్లాలో మొత్తంగా 5,85,464 ఎకరాల ఆయకట్టు ఉందని, ఎత్తిపోతల పథకాలకు రూ.కోట్లాది నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆధునీకరణ పనుల్లో భాగంగా లైనింగ్ పనులకు రూ.29 కోట్లు, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు రూ.184.60, , జాన్‌పహాడ్ మేజర్ లైనింగ్ పనులకు రూ.52.11 కోట్ల చొప్పున మంజూరు చేశామన్నారు. ఇవేకాకుండా మూసీ కాలువల ఆధునీకరణ పనులను చేపడుతున్నామని, చెక్‌డ్యామ్‌లనిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగేలా చేస్తున్నామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరిచ్చి రెండు సీజన్లలో పంటలు పండేలా చేసి తుంగతుర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.



గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్య్ర పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది.

– మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి ఉత్తమ్, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ, ఇతర అధికారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో టీజీ ఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్, వైష్ణవి పాఠశాల, బాల భవన్, జెడ్పీహెచ్‌ఎస్ చివ్వెంల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభినందించి వారితో ఫొటోలు దిగారు. అనంతరం పలువురికి బహుమతులు అందించారు.

స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం

స్వాతంత్య్ర సమరయోధులైన గరిడేపల్లికి చెందిన గంట లక్ష్మారెడ్డి, నడిగూడెంకు చెందిన భిక్షమయ్యలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



స్వాతంత్య్ర సమర యోధులను సన్మానిస్తున్న మంత్రి ఉత్తమ్

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రధాన జడ్జి లక్ష్మీశారద

చివ్వెంల : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళల కోసం తెచ్చిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లను ప్రారంభించారు. అనంతరం బధిరుల పాఠశాలకు చెందిన మూగ విద్యార్థి చేసిన యోగాసనాలు, బాలసదన్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అధ్యాపకుల కృషితోనే అడ్మిషన్లు పెరిగాయి



మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

నేరేడుచర్ల : అధ్యాపకుల కృషితోనే ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు విద్యాధికారి (డీఐఈఓ), నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భానునాయక్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ఉత్తమ విద్యార్థులలకు బహుమతుల ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కళాశాలలో పనిచేసి రిటైరైన రామానుజాచార్యులు జ్ఞాపకార్థంగా ఆయన సతిమణీ మంగతాయారు ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు రూ.2,500 చొప్పున లయన్స్‌క్లబ్ ద్వారా నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గున్‌రెడ్డి, సైదిరెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, కార్యదర్శి యూసుఫ్, సభ్యులు విశ్వనాథం, నాగేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు వెంకటరమణ, మద్దిమడుగు సైదులు, ప్రణతి, శ్రీనివాసులు, వెంకన్న, నరేందర్, అంజయ్య, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

ఐదు గేట్ల ద్వారా 'పులిచింతల' నీటి విడుదల



దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు : చింతలపాలెం మండల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. శుక్రవారం రాత్రి వరకు ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి 1,55,464 క్యూసెక్కుల వరద వస్తుండగా ఐదు గేట్లను నాలుగు మీటర్ల మేర పైకి ఎత్తి 1,67,130 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కూలిన గుండ్లసింగారం బ్రిడ్జి

- మూణ్నాళ్ల ముచ్చటగా మరమ్మతులు
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం



వరద ఉధృతికి కూలిన గుండ్లసింగారం బ్రిడ్జి




బ్రిడ్జి కూలడంతో కోతకు గురైన రహదారి

నూతనకల్ : వరద ఉధృతి కారణంగా నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామం వద్ద బ్రిడ్జి స్వల్పంగా కూలింది. వర్షాలకు దెబ్బతిన్న ఈ బ్రిడ్జిని తక్షణ చర్యల్లో భాగంగా గతేడాది రూ.3లక్షల నిధులతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టారు. అధికారులు కూడా పర్యవేక్షించకపోవడంతో బ్రిడ్జి మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. దీంతో ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి అధికంగా రావడంతో గతంలో మరమ్మతులు చేసిన ప్రాంతంలో బ్రిడ్జి కూలింది. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ డీఈ పద్మావతి సంఘటన స్థలాన్ని సందర్శించారు. వాహనాలదారులు ప్రమాదం బారిన పడకుండా బ్రిడ్జి కూలిన ప్రదేశాన్ని గుర్తుపట్టేలా మార్కింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు బ్రిడ్జిపై నుంచి నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

సాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద

- 14గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్ వద్ద 14గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్: ఎగువ నుంచి సాగర్‌కు వరద స్వల్పంగా తగ్గింది. నాలుగు రోజులుగా 26గేట్లను ఎత్తిన అధికారులు.. శుక్రవారం 14గేట్లకు తగ్గించి నీటిని విడుదల చేస్తున్నారు. వద్ద పద్నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 1,44,694 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి 14 గేట్ల నుంచి, విద్యుదుత్పాదనతో కలిపి 1,38,244 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.90 అడుగులు ఉంది.

వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణం తంతు చేపట్టారు. ఆ తర్వాత గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

మునగాల : సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదమున్నందున ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంహెచ్‌ఓ జి.చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మునగాల మండలం కలకోవలో కొనసాగుతున్న ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో సేవలందించాలన్నారు. డెంగీ సోకిన వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నిరంతర పర్యవేక్షణతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్, సూపర్‌వైజర్ జయమ్మ, ఏఎన్‌ఎంలు నాగమణి, శాంతమ్మ, లలిత, నర్సమ్మ, హెల్త్ అసిస్టెంట్లు లింగం రామకృష్ణ, కొర్రా లింగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు భారీగా నీరు



మూసీ ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం వరద పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు తొమ్మిది క్రస్ట్ గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం ఉదయం 7,200 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి 15,109 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టులో ఇప్పటికే నీటిమట్టం 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండటంతో అప్రమత్తమైన అధికారులు ఉదయం తెరిచిన ఆరు క్రస్టు గేట్లకు అదనంగా సాయంత్రం మరో మూడు క్రస్టు గేట్లను(మొత్తం 9 గేట్లు) రెండు అడుగుల మేర ఎత్తి 14,910 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఆయకట్టులో పంటల సాగుకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రెండో జత యూనిఫాం ఎప్పుడో!

- ఇప్పటి వరకు ఒక్క జతే పంపిణీ
- ఈనెలలో రెండో జత అందించాలని ప్రభుత్వం ఆదేశం
- వస్త్రం రాకపోవడంతో ఆగిన ప్రక్రియ
- జిల్లా వ్యాప్తంగా 950 స్కూళ్లు.. 49,374 మంది విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు దాటినా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నేటికీ ఒక్క జత యూనిఫాం మాత్రమే అందజేశారు. రెండో జత యూనిఫామ్ కోసం జిల్లాల వారీగా వస్త్రాన్ని జూలైలో ఉన్నతాధికారులు అందించారు. 15 ఆగస్టు వరకు రెండో జత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా నేటికీ అతిగతీ లేదు. ఒక్క జతతోనే విద్యార్థులు రోజూ పాఠశాలలకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాకు చేరని చొక్కా వస్త్రం..

అయితే కొన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో రెండో జతకు సంబంధించి వస్త్రం వచ్చి కుట్టుపని సైతం పూర్తి కావచ్చినట్టు సమాచారం. అయితే మన జిల్లాకు మాత్రం ఇప్పటి వరకు రెండో జత కోసం బాలబాలికలకు పైజామా, నిక్కర్లు, ఫ్యాంట్ వస్త్రాలు మాత్రమే వచ్చాయి. చొక్కా వస్త్రం అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ స్వాతంత్య్ర దినోత్సవం రోజు రెండో జత అందే అవకాశం లేకుండా పోయింది. రోజు ఒక్క జతే వాష్ చేసుకొని అదే వేసుకొని స్కూల్‌కు వస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో ఒకే జత ఉతికితే మళ్లీ అది ఆరకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు సివిల్ డ్రెస్‌లోనే వస్తున్నారు.



యూనిఫాం కుడుతున్న మహిళలు (ఫైల్)

వస్త్రం త్వరలోనే రానుంది

ప్రస్తుతం రెండో జతకు సంబంధించి నిక్కర్, పైజామా, ఫ్యాంట్‌లకు సంబంధించి వస్త్రం వచ్చింది. ఆయా మండలాల ఎంఈఓలకు పంపించాం. చొక్కా సంబంధించి కూడా త్వరలోనే వస్తుంది. రెండో జత యూనిఫాం కూడా సకాలంలోనే అందిస్తాం.

– రాంబాబు, జిల్లా సెక్టోరియల్ అధికారి

కొత్తవారికీ అందని యూనిఫామ్

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 950 ఉన్నాయి. వీటిలో 23,547 మంది బాలురు, 25,827 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఒక్కో జత చొప్పున 49,374 జతలు కుట్టించి పాఠశాలలు పునఃప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు అందజేశారు. అయితే జూన్‌లో ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాటలో 5,500 మంది విద్యార్థుల వరకు అడ్మిషన్లు వచ్చాయి. వీరికి కూడా అదనంగా యూనిఫామ్స్ అందించాల్సి ఉంది.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి



గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి : గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. సూర్యాపేటలో రూ.1.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. భావితరాలకు మంచి విద్యను అందజేసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ భవనంలో మౌలిక వసతుల కల్పనకు మరో కోటి రూపాయలు మంజూరు చేశామన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి అదనంగా మరో రూ.కోటి మంజూరు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, గ్రంథాలయాల సెక్రటరీ బాలమ్మ పాల్గొన్నారు.


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి


సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు


సూర్యాపేటలో ఎగ్జిబిషన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


గౌతమ్ మోడల్ స్కూల్ జైజవాన్ నృత్య ప్రదర్శన


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


భువనగిరిలో సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శకటం ప్రదర్శన


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు


భువనగిరిలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఉత్తమ సేవలకు గుర్తింపు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


అప్పారావు, జెడ్పీ సీఈఓ, సూర్యాపేట | జయలత, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూర్యాపేట | శ్రీనివాస్, పస్సీ కార్పొరేషన్ ఈడీ, సూర్యాపేట | సుదర్శన్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ | రవికుమార్, జిల్లా కోశాధికారి, సూర్యాపేట | రామ్‌కిషోర్, ఈఈ, జిల్లా నీటి పారుదల శాఖ, సూర్యాపేట


హరిప్రసాద్, తహసీల్దార్, తిరుమలగిరి | రంజిత్‌రెడ్డి ఆర్ఐ, పెన్‌పహాడ్ | సుశీల, అడిషనల్ ఆర్ఐ, మేళ్లచెరువు | శ్రీలత, సూపరింటెండెంట్, కలెక్టరేట్ సూర్యాపేట | నాగేశ్వర్‌రావు, అడిషనల్ ఎస్పీ | వెంకటనారాయణ, ఏఆర్ ఎస్ఐ | ఎండీ.షంషీద్‌ఖాన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట | లింగయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేట | నాగమోహన్, ఏఆర్ పోలీస్, సూర్యాపేట | రవి, సీసీ టు కలెక్టరేట్ | సుష్మ, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్


శ్వేత, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ | గోపి, గన్‌మెన్, కలెక్టరేట్, సూర్యాపేట | లింగా, డ్రైవర్, కలెక్టరేట్ | నాతి సవీందర్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సూర్యాపేట | శ్యామ్, సీనియర్ అసిస్టెంట్, చీఫ్ ప్లానింగ్ ఆఫీస్, సూర్యాపేట | రాజీవ్, టైపిస్ట్, డీపీఆర్ఓ కార్యాలయం, సూర్యాపేట | నరేష్, ఫొటోగ్రాఫర్, డీపీఆర్ఓ కార్యాలయం, సూర్యాపేట | వీరభద్రం ఇన్ఫర్మేషన్ టాక్, ఐఅండ్‌పీఆర్, సూర్యాపేట | సైదులు, రికార్డ్ అసిస్టెంట్, ఐఅండ్‌పీఆర్, సూర్యాపేట | చైతన్య, డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్, సూర్యాపేట | సాయిరాం, ఆర్ఎస్ఐ, వెల్ఫేర్ ఆఫీసర్ డీపీఆర్, సూర్యాపేట


షేక్ సైదాబి ఏఎస్ఐ, భరోసా సెంటర్ సూర్యాపేట | వెంకట్‌రెడ్డి, ఏఆర్‌పీసీ, పీఎస్ఓ టు ఎస్పీ సూర్యాపేట | ప్రభాకర్, ఎస్ఐ జోనల్ ఇంటెలిజెన్స్, సూర్యాపేట | నవీన్, పోలీస్ జోనల్ ఇంటెలిజెన్స్, సూర్యాపేట | సురేష్, పోలీస్ జోనల్ ఇంటెలిజెన్స్, సూర్యాపేట | కీర్తన, ఉమెన్స్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట | ఎల్లయ్య ఏఆర్ పోలీస్, సూర్యాపేట | సీహెచ్.సైదులు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేట | సంతోష్‌కుమార్ పోలీస్, ట్రాఫిక్ పీఎస్ సూర్యాపేట | వినీల, ఎస్ఐ, ఎక్సైజ్‌శాఖ, హుజూర్‌నగర్ | పద్మజ, ప్రొఫెసర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, సూర్యాపేట

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, సహస్ర నామార్చనతో కొలిచారు. ఇక ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం , గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, వెండి జోడు సేవోత్సవం నిర్వహించారు.

ఆత్మహత్య కేసులో నలుగురి రిమాండ్

పాలకవీడు: మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన బట్టు కళాశ్రీ (20) ఈ నెల 9న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. అదనపు కట్నం కోసం కళాశ్రీ అత్త ఉమాదేవి, మామ హనుమంతరావు, ఆడపడుచు ప్రియదర్శిని, భర్త పవన్‌కళ్యాణ్ కళాశ్రీని తరచూ వేధించేవారు. భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై కోటేష్ తెలిపారు. నలుగురు నిందితులను శుక్రవారం హుజూర్‌నగర్ కోర్టు ఎదుట హాజరుపరచగా నల్లగొండ సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

జూదం ఆడుతున్న నలుగురు అరెస్ట్

చింతపల్లి : జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం చింతపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వింజమూరు గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నారని సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద మూడు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లు, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భువనగిరిటౌన్ : ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం భువనగిరి పట్టణ కేంద్రంలోని బహార్ పేటలో చోటుచేసుకుంది. భువనగిరిలో గురువారం జరిగిన బోనాల పండగలో శుభాకాంక్షలు తెలిపేందుకు ఫ్లెక్సీలను కడుతుండగా కమ్మ ఉదయ్ కిరణ్ (24) విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి తండ్రి కమ్మ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రభాకర్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరటికల్ గ్రామానికి చెందిన కట్టికోల ప్రభాకర్(55), చిన్నం నర్సయ్యతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఆత్మకూరు(ఎం) నుంచి కొరటికల్‌కు వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సుంచు మహేష్ అతని భార్యతో కలిసి కొరటికల్ నుంచి ఆత్మకూరు(ఎం)కు బైక్‌పై వస్తున్నాడు. కేజీబీవీ పాఠశాల సమీపంలో టీవీఎస్ ఎక్సెల్, బైక్ ఢీకొన్నాయి. దీంతో ప్రభాకర్‌తో పాటు సుంచు మహేష్‌కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ హనుమంతు తెలిపారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు


సాగర్ ఎడమ కాలువలో పడిన కారు

నేరేడుచర్ల : కారు అదుపుతప్పి సాగర్ ఎడమ కాలువలో పడింది. పెన్‌పహాడ్ మండలం అన్నారం గ్రామానికి చెందిన నారాయణ నరేష్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సూర్యాపేటలో నూతన ఇంటి నిర్మాణం కోసం సామగ్రిని కారులో తీసుకువచ్చాడు. ఇంటి వద్ద సామగ్రిని పెట్టి తన అత్తగారి ఊరైన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు బయలుదేరాడు. సూర్యాపేట మీదుగా మిర్యాలగూడకు వెళ్లేందుకు నేరేడుచర్ల మండలం కల్లూరు అడ్డ రోడ్డు వద్దకు వచ్చాడు. మిర్యాగూడ రోడ్డు వైపు వెళ్లకుండా పొరపాటున సాగర్ ఎడమ కాలువ వైపు తిప్పాడు. దీంతో కారు అదుపుతప్పి కాలువలో పడిపోయింది. నరేష్‌రెడ్డి కారు నుంచి దూకడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సహకారంతో కారు బయటకు తీశారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

తిప్పర్తి: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తిప్పర్తి మండలంలోని తిప్పర్తి- రాయినిగూడం రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బండారు మహేష్ (37) ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. అప్పులు ఎక్కువ కావడం, వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ రైల్వేస్టేషన్ మాస్టర్ అభినవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గంజాయి నిందితుల అరెస్టు

- 1.650 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

హాలియా : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం హాలియా పోలీస్ స్టేషన్‌లో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామానికి చెందిన వజ్రాల రాజశేఖర్, నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంటతండాకు చెందిన కుందాల వేణు, తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన గురజాల మహేందర్ గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రాకు చెందిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండా శివారులోని అల్వాల ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. హాలియా పోలీసులు అల్వాల ఎక్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా 1.650 కేజీల గంజాయి లభ్యమైంది. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోగా, వారిని అరెస్టు చేశారు. గంజాయి సరఫరాకు సంబంధించిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద 1.650 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌లను డీఎస్పీ అభినందించారు.

త్రివర్ణ పతాక అలంకరణలో సాయినాథుడు


త్రివర్ణ పతాక అలంకరణలో దర్శనమిస్తున్న సాయినాథుడు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో శుక్రవారం లక్ష గాజుల పూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సామూహిక కుంకుమార్చనలు లక్ష గాజుల పూజా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు వేలే సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక రాజేశ్వరి పీఠాధిపతి మేలురి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే త్రివర్ణ పతాకంతో సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచిగంటి ధనంజయ, ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బుద్ధవనం సిబ్బందికి ప్రశంసా పత్రాలు


బుద్ధవనం సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుద్ధవనం సిబ్బందికి ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకు ముందు బుద్ధవనంలోని మహాస్థూపం వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. 20ఏళ్లుగా బుద్ధవనంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించే విధంగా ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నాజీష్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకల్లో కోదాడ విద్యార్థులు


ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కోదాడలోని తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడరూరల్ : ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయానికి చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా భారత రక్షణశాఖ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో 2లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200మంది విద్యార్థులకు ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు హాజరయ్యేందుకు అవకాశం దక్కింది. వారిలో కోదాడ తేజ విద్యాలయం విద్యార్థులు 15 మంది ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

గోల్కొండ కోటలో మోగిన సతీష్ డప్పు దరువు

గరిడేపల్లి: గోల్కొండ కోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ డప్పు కళా బృందం, మహిళా డప్పు కళాకారులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ మామిడి హరికృష్ణ సహకారం, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సౌజన్యంతో గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శనలో పాల్గొన్నట్లు మాస్టర్ అమరవరపు సతీష్ తెలిపారు. వేడుకల్లో కల్పన, స్వరూప, భువన, అపర్ణ, నాగమణి, వీరబాబు, శోభన్, గంగ, వెంకటమ్మ, కుమారి, సంజయ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శించిన కళాకారులు